సాక్షి
అనకాపల్లి

సోమవారం । 6 । అక్టోబర్ । 2025



సమావేశంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంటు నియోజకవర్గ సమన్వయకర్త బొడ్డేడ ప్రసాద్, మాజీ ఎంపీ డాక్టర్ బి.వి.సత్యవతి తదితరులు

ప్రభుత్వ మెడికల్ కాలేజీలను పెట్టి వైద్య విద్యను మరింత మందికి అందుబాటులోకి తేవాలన్న సత్సంకల్పానికి కూటమి నేతలు తూట్లు పొడిచారు. ఆంధ్రుల హక్కు విశాఖ ఉక్కుపై ప్రై'వేటు' వేస్తున్నారు. బల్క్‌డ్రగ్ పార్కుతో మత్స్యకారుల నుంచి ఆంధ్ర–ఒడిశా సరిహద్దులోని గిరిజనుల వరకు అనేక విషయాల్లో అన్యాయం చేస్తున్నారు. సాగునీటి ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేస్తూ ఉత్తరాంధ్ర రైతులకు తీరని ద్రోహం తలపెట్టారు. ఇలా వివిధ వర్గాల ప్రజల బతుకులను దుర్భరం చేస్తున్న కూటమి ప్రభుత్వ పాలనపై వైఎస్సార్‌సీపీ సమరభేరి మోగించింది. ఆదివారం జరిగిన ఉత్తరాంధ్ర స్థాయి విస్తృత సమావేశంలో ఏడు అంశాలపై తీర్మానాలు చేసింది.



ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై 7 తీర్మానాలు

సభాధ్యక్షత వహించిన కురసాల కన్నబాబు పార్టీ నేతల నుంచి ముఖ్యమైన సూచనలు, సలహాలు తీసుకున్నారు. అనంతరం ఉత్తరాంధ్ర ప్రాంతంలోని 7 ప్రజా వ్యతిరేక విధానాలపై వైఎస్సార్ సీపీ తీర్మానాలు చేసింది.

సమావేశంలో ఉత్తరాంధ్ర రీజినల్ కో ఆర్డినేటర్ కురసాల కన్నబాబు, శాసనమండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ, ఎంపీలు గొల్ల బాబూరావు, తనూజరాణి, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు, మాజీ స్పీకర్ తమ్మినేని, మాజీ మంత్రులు ధర్మాన ప్రసాద రావు, కృష్ణదాస్, బూడి ముత్యాలనాయుడు, అమర్‌నాథ్, పుష్పశ్రీవాణి, రాజన్న దొర, పార్టీ జిల్లాల అధ్యక్షులు కేకే రాజు, మజ్జి శ్రీనివాస రావు, పరీక్షిత్ రాజు, పార్లమెంట్ పరిశీలకుడు కదిరి బాబూరావు, మాజీ ఎంపీ బెల్లాన, మాజీ ఎమ్మెల్యేలు ధర్మశ్రీ, కోలగట్ల

ఉత్తరాంధ్ర సమస్యలపై సమరభేరి



వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్ కన్నబాబు, శాసనమండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ, ఎంపీలు గొల్ల బాబూరావు, తనూజరాణి, ఎమ్మెల్సీలు కల్యాణి, రవిబాబు, మాజీ మంత్రులు ధర్మాన ప్రసాదరావు, కృష్ణ దాస్, బూడి ముత్యాలనాయుడు, అమర్‌నాథ్, జిల్లా అధ్యక్షుడు కేకే రాజు, పరిశీలకుడు బాబూరావు

- కూటమి సర్కారు వైఫల్యాలపై ఉద్యమించనున్న వైఎస్సార్‌సీపీ
- ఉత్తరాంధ్ర విస్తృత స్థాయి సమావేశంలో పార్టీ నేతల తీర్మానం
- ఏడు అంశాలపై ప్రజలకు న్యాయం జరిగే వరకు రాజీలేని పోరాటం
- 9న నర్సీపట్నం మెడికల్ కాలేజీని సందర్శించనున్న వైఎస్ జగన్
- విశాఖ ఎయిర్‌పోర్టు నుంచి రోడ్డు మార్గంలో భీమబోయినపాలెం చేరుకోనున్న మాజీ సీఎం

సాక్షి, విశాఖపట్నం: దిక్కులేని ప్రజల గొంతుకై.. వారి తరఫున పోరాటానికి సిద్ధమై.. వాయిస్ ఫర్ ది వాయిస్‌లెస్‌గా నిలుస్తూ.. సమస్యల పరిష్కారమే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ కూటమి సర్కారుకు అల్టి మేటం ఇచ్చింది. ప్రభుత్వం తప్పులు, వైఫల్యాలను ఇకపై ఉపేక్షించేది లేదని హెచ్చరించింది. వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఉత్తరాంధ్ర సమరశంఖం పూరించాలని నిర్ణయించినట్టు పార్టీ ఉత్తరాంధ్ర రీజినల్ కోఆర్డినేటర్ కురసాల కన్నబాబు, శాసన మండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ ప్రకటించారు. ఆదివారం ఆనందపురంలోని పెద్దిపాలెంలోని చెన్నాస్ కన్వెన్షన్ హాల్లో ఉత్తరాంధ్ర జిల్లాల వైఎస్సార్ సీపీ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. తొలుత మహానేత వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించి సమావేశం ప్రారంభించారు. ఈ సమావేశంలో కురసాల కన్నబాబు మాట్లాడుతూ.. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మంచి పేరొస్తుందనే భయంతో ఆయన అమలు చేసిన సంక్షేమ పథకాలను నిర్వీర్యం చేస్తున్నారని మండిపడ్డారు. పేదలకు ఉచిత వైద్యం అందించడమే లక్ష్యంగా 17 మెడికల్ కాలేజీలు మొదలుపెట్టి 7 కాలేజీలను పూర్తి చేశారని, వాటిని కూడా ప్రైవేటీకరణ పేరుతో చంద్రబాబు తన వారి చేతుల్లో పెట్టే ప్రయత్నం చేయడం దుర్మార్గమని పేర్కొన్నారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా రాజీలేని పోరాటం చేయాలని వైఎస్సార్ సీపీ నిర్ణయించిందన్నారు. ఉత్తరాంధ్ర నుంచే సమరశంఖం పూరించేందుకు ఈ నెల 9న నర్సీపట్నం మెడికల్ కాలేజీని వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సందర్శించనున్నారని చెప్పారు. అక్కడే ప్రజలను ఉద్దేశించి మీడియాతో మాట్లాడతారని వివరించారు.

కార్యక్రమంలో మాజీ డిప్యూటీ సీఎంలు బూడి ముత్యాలనాయుడు, ధర్మాన కృష్ణదాస్, పుష్ప శ్రీవాణి, ఎమ్మెల్సీలు నర్తు రామారావు, సురేష్ బాబు, కుంభా రవిబాబు, పండుల రవీంద్రబాబు, ఎమ్మెల్యేలు రేగం మత్స్యలింగం, మత్స్యరాస విశ్వేశ్వరరాజు, జెడ్పీ చైర్‌పర్సన్లు జె.సుభద్ర, పిరియా విజయ, పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్ రాజు, పార్లమెంట్ సమన్వయ కర్తలు బొడ్డేడ ప్రసాద్, బెల్లాన చంద్రశేఖర్, పార్లమెంట్ పరిశీలకులు కదిరి బాబూరావు, శోభా హైమావతి, సూర్యానారాయణ రాజు, మాజీ ఎంపీలు భీశెట్టి వెంకటసత్యవతి, గొడ్డేటి మాధవి, మాజీ ఎమ్మెల్యేలు కోలగట్ల వీరభద్ర స్వామి, కరణం ధర్మశ్రీ, పెట్ల ఉమాశంకర్ గణేష్, అన్నంరెడ్డి అదీప్‌రాజ్, కన్నబాబు రాజు, తిప్పల నాగిరెడ్డి, గొర్లె కిరణ్‌కుమార్, తైనాల విజయ్‌కుమార్, చింతలపూడి వెంకట్రామయ్య, తిప్పల గురుమూర్తిరెడ్డి, చెట్టి ఫాల్గుణ, పిరియా సాయిరాజు, విశ్వసరాయి కళావతి, కె.భాగ్యలక్ష్మి, చెంగల వెంకట్రావ్, సమన్వయకర్తలు మొల్లి అప్పారావు, మలసాల భరత్‌కుమార్, పేరాడ తిలక్, చింతాడ రవి కుమార్, రాష్ట్ర కార్యదర్శులు లక్ష్మణరావు, కరిమి రాజేశ్వరరావు, సాడి శాంప్రసాద్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శులు చింతకాయల సన్యాసిపాత్రుడు, చిక్కాల రామారావు, పైల శ్రీనివాసరావు, ఉత్తరాంధ్ర మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ ఈర్లె అనురాధ, రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు జాన్ వెస్లీ, సీఈసీ సభ్యులు కోలా గురువులు, కాయల వెంకటరెడ్డి, ఎస్ఈసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా..



మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ మాట్లాడుతూ.. పేద ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించాలనే ఆశయంతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రూ. 8 వేల కోట్లకు పైగా ఖర్చు చేసి 17 మెడికల్ కాలేజీల నిర్మాణం చేపట్టిందని, వాటిలో ఐదు ప్రారంభమయ్యాయని, మరో రెండు పూర్తయ్యాయని గుర్తుచేశారు. మిగిలిన వాటిని కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరణ చేయడాన్ని వ్యతిరేకిస్తూ తొలి తీర్మానం ప్రవేశపెట్టగా.. పార్టీ నేతలంతా ఆమోదించారు.

స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా..



రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు మాట్లాడుతూ.. 'విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పార్లమెంటులో చాలా సార్లు ప్రశ్నించాను. స్టీల్‌ప్లాంట్‌కు నిధులు ఇచ్చామని కేంద్ర మంత్రులు చెబుతున్నా.. ప్రైవేటీకరణ చేయడానికి సిద్ధంగా ఉన్నట్లుగానే కేంద్రం వైఖరి ఉందన్నారు. ఎన్నికల ముందు స్టీల్ ప్లాంట్‌ను కాపాడతామని హామీ ఇచ్చిన చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఇప్పుడు మౌనంగా ఉన్నారు. స్టీల్‌ప్లాంట్ కాపాడుకునేందుకు మనమంతా ఏకతాటిపై వచ్చి పోరాడాలి' అని తీర్మానం ప్రవేశపెట్టారు. దీనికి విశాఖ పార్లమెంట్ సమన్వయకర్త బొత్స ఝాన్సీ, గాజువాక సమన్వయకర్త దేవన్‌రెడ్డి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా బొత్స ఝాన్సీ మాట్లాడుతూ విశాఖ ఉక్కు–ఆంధ్రుల హక్కు అనే నినాదంతో ఏర్పడిన స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరిస్తామంటే వైఎస్సార్ సీపీ చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. దేవన్‌రెడ్డి మాట్లాడుతూ.. 'ఒక వైపు విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో 34 విభాగాలను ప్రైవేటీకరిస్తున్నారు. మరో వైపు నుంచి వీఆర్ఎస్‌కు వెళ్లని ఉద్యోగులను బెదిరిస్తున్నారు. దీనిపై నియోజకవర్గ స్థాయిలో పోరాటం చేస్తున్నా ఫలితం లేకుండా పోతోంది. ఉత్తరాంధ్ర స్థాయిలో భారీగా పోరాటం చేయాల్సిన అవసరం ఉంది.' అని అభిప్రాయపడ్డారు.

గిరిజన సమస్యల పరిష్కారం కోసం..



ఆంధ్రా–ఒడిశా సరిహద్దులో గిరిజన సమస్యలకు శాశ్వత పరిష్కారం కోసం కూటమి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర తీర్మానం చేశారు. కేంద్రం, ఒడిశా, ఆంధ్రలో బీజేపీ ప్రభుత్వం అధికారంలో ఉందని, సరిహద్దు గిరిజనుల సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యపై పోరాడాలని తీర్మానించారు.

నక్కపల్లి బల్క్‌డ్రగ్ పార్కు భూసేకరణపై..



బల్క్‌డ్రగ్ పార్కు భూసేకరణను వ్యతిరేకిస్తూ రిలే నిరాహార దీక్షలు చేస్తున్న మత్స్యకారులకు న్యాయం చేయాలని కోరుతూ కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ తీర్మానం ప్రవేశ పెట్టారు. దీనిపై ఎంపీ గొల్ల బాబూరావు మాట్లాడుతూ ఈ రసాయనిక పరిశ్రమ వల్ల మత్స్యకారుల జీవనోపాధి దెబ్బతింటుందని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మత్స్యకారులకు అన్యాయం చేయవద్దన్నారు.

ప్రభుత్వ భూముల కేటాయింపుపై..



లులూ వంటి సంస్థలకు కారుచౌకగా భూములు కట్టబెట్టడాన్ని వ్యతిరేకిస్తూ విజయనగరం జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'విశాఖ, విజయనగరం జిల్లాల్లో ఉన్న విలువైన భూములను కారుచౌకగా కార్పొరేట్ సంస్థలకు కూటమి ప్రభుత్వం కట్టబెడుతోంది. వైఎస్సార్ సీపీ హయాంలో ఉత్తరాంధ్ర ప్రాంతంలో అభివృద్ధి పనులకు, ట్రైబల్ ఇన్‌స్టిట్యూట్ కోసం భూసేకరణ చేపట్టాం. దానిపై చాలా దుష్ప్రచారం చేశారు. ఇప్పుడు లులూ వంటి అడ్రస్ లేని కార్పొరేట్ సంస్థలకు ఖరీదైన భూములను అప్పగిస్తున్నారు.' అని అన్నారు.

చిరు వ్యాపారుల తొలగింపునకు వ్యతిరేకంగా..



జీవీఎంసీ పరిధిలో 42 వేల మంది చిరు వ్యాపారుల షాపులను, ఫుడ్‌కోర్టులను తొలగించడాన్ని వ్యతిరేకిస్తూ పార్టీ విశాఖ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు తీర్మానం ప్రవేశపెట్టారు. దీనికి మాజీ ఎమ్మెల్యేలు వాసుపల్లి గణేష్‌కుమార్, మళ్ల విజయప్రసాద్ మద్దతు పలికారు. ఈ సందర్భంగా కేకే రాజు మాట్లాడుతూ..'కూటమి ప్రభుత్వం చిరువ్యాపారుల కుటుంబాలను రోడ్డున పడేసింది. హాకర్లకు ఏయూ స్థలంలో వ్యాపారాలు చేసుకునే అవకాశం కల్పిస్తామని మభ్యపెడుతున్నారు. దీన్ని వైఎస్సార్ సీపీ తీవ్రంగా ఖండిస్తోంది. వ్యాపారులకు న్యాయం జరిగేదాకా పోరాడుతాం.' అని అన్నారు. మాజీ ఎమ్మెల్యేలు వాసుపల్లి, మళ్ల మాట్లాడుతూ.. ' చిరు వ్యాపారుల దుకాణాలను కూల్చేసి కూటమి ప్రభుత్వం వారి పొట్టకొట్టింది. సుప్రీంకోర్టు ఆదేశాలున్నప్పటికీ క్రూరంగా వ్యవహరించారు. పార్టీ ఆదేశాల మేరకు ఉత్తరాంధ్ర సమస్యలపై పోరాటం చేయడానికి సిద్ధంగా ఉన్నాం.' అని అన్నారు.

సాగునీటి ప్రాజెక్టులపై..



ఉత్తరాంధ్రలో పెండింగ్‌లో ఉన్న వంశధార, జంఝావతి, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి, తోటపల్లి వంటి సాగునీటి, తాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా తమ్మినేని మాట్లాడుతూ.. 'వంశధార రిజర్వాయర్ నుంచి ఉద్దానం ప్రాంతానికి మంచి నీటి సరఫరా ప్రాజెక్టును వైఎస్సార్ సీపీ ప్రారంభించింది. పలాస నియోజకవర్గంకు పూర్తి స్థాయిలో శుద్ధ జలం అందించాం. మిగిలిన పనులు పూర్తి చేయాలి. వైఎస్సార్ సీపీ హయాంలో మూలపేట పోర్టు పనులు 90 శాతం పూర్తయ్యాయి. 1995లో ప్రారంభమైన వంశధార ఇప్పటికీ పూర్తి కాలేదు. ఈ ప్రాజెక్టు పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలి.' అని అన్నారు. ఈ తీర్మానానికి మద్దతుగా మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ మాట్లాడుతూ.. సాగు నీరు అందకపోవడంతో అనకాపల్లి జిల్లాలో చెరకు, వరి సాగు తగ్గిపోయిందన్నారు. జిల్లాలోని ఐదు షుగర్ ఫ్యాక్టరీల్లో చోడవరం ఒకటే మిగిలిందని, దానికి కూడా కాపాడుకోలేదని పరిస్థితి నెలకొందన్నారు.

పార్టీ సంస్థాగత బలోపేతంపై దృష్టి

శాసనమండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ.. పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసుకుంటే, మనం చేసే ప్రతీ కార్యక్రమం ప్రజల్లోకి వెళుతుందన్నారు. పెండింగ్‌లో ఉన్న జిల్లా, మండల కమిటీలను, గ్రామ ఇన్‌చార్జిల నియామకాలను గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు మాట్లాడుతూ.. 'స్వాతంత్ర్యం అనంతరం ఉత్తరాంధ్రకు మేలు చేసిన ముఖ్యమంత్రులు వైఎస్సార్, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే. మూలపేట పోర్టు, ప్రభుత్వ మెడికల్ కళాశాలలు వైఎస్సార్ సీపీ హయాంలోనే వచ్చాయి. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను, దొరికిన ప్రతీ అంశాన్ని మనం ప్రశ్నించాలి. స్థానిక అంశాలపై దృష్టి సారించాలి. యువ నాయకత్వం పార్టీ బలోపేతానికి కృషి చేసి, నాయకులుగా ఎదగాలి.'అని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే వరుదు కల్యాణి మాట్లాడుతూ స్థానిక కమిటీల్లో మహిళలకు సమన్వయకర్తలు ప్రాధాన్యమివ్వాలని కోరారు. స్థానిక సమస్యలపై విస్తృతంగా పోరాటం చేయాలని మహిళలకు పిలుపునిచ్చారు. అరకు ఎంపీ తనూజ రాణి మాట్లాడుతూ..ప్రతీ నియోజకవర్గంలో సమన్వయకర్త సమక్షంలో నియోజకవర్గ స్థాయి సమస్యలపై సమావేశం ఏర్పాటు చేయాలన్నారు. వాటిని పరిష్కరించే వరకూ ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చేలా పోరాటం చేయాలని సూచించారు.

ఈ-తంటా..!

- లక్ష్యం చేరని పంట నమోదు
- కొత్త నిబంధనలతో క్షేత్రస్థాయి సిబ్బందికి ఇబ్బందులు
- మరోసారి ఈనెల 25 వరకు గడువు పొడిగింపు

వ్యవసాయం, ఉద్యానం సహా జిల్లాలో మొత్తం పంటల సాగు విస్తీర్ణం 3.51 లక్షల ఎకరాలు
నమోదు చేయాల్సిన మదులు: 17,30,843
ఇప్పటివరకు నమోదు చేసినవి: 3,77,528
నమోదు శాతం: 21.8

యలమంచిలి రూరల్: అన్నదాతలు వ్యవసాయ సంబంధిత పథకాలు పొందాలన్నా, ఉత్పత్తులు అమ్ముకోవాలన్నా, పంటల బీమా వర్తించాలన్నా అన్నింటికీ ఈ–పంట నమోదే ప్రామాణికం. కీలకమైన ఈ ప్రక్రియను వ్యవసాయ, రెవెన్యూ శాఖలు సమన్వయంతో చేపట్టాల్సి ఉంది. శాఖల మధ్య సమన్వయలోపం, ఈ–పంట నమోదుకు సంబంధించి మారిన కొత్త నిబంధనలు, సాంకేతిక అవరోధాల కారణంగా జిల్లాలో ఈ–పంట నమోదు మందకొడిగా సాగుతోంది. రెండుసార్లు గడువు పొడిగించినా ఉద్యాన, వ్యవసాయ, రెవెన్యూ, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం చూపుతున్నారు. ఈ ఏడాది జూలై మూడో వారం నుంచి ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఈ–పంట నమోదు ప్రక్రియ ప్రారంభమైంది. తొలుత గత నెల 30లోగా ఈ–పంట నమోదు పూర్తి చేయాలని గడువు విధించారు. ఆ తర్వాత ఈ నెల 15 వరకు గడువు పొడిగించగా, తాజాగా ఈ నెల 25లోగా పంటల నమోదు పూర్తి చేయాలని వ్యవసాయశాఖ డైరెక్టర్ డిల్లీరావు ప్రకటించారు. అయితే జిల్లాలో క్షేత్రస్థాయి పరిస్థితులు చూస్తే గడువులోగా పంట నమోదు పూర్తయ్యేలా లేదు. దీంతో అధికారులు, రాష్ట్ర ప్రభుత్వం తీరుతో తాము నష్టపోతామన్న ఆందోళన రైతుల్లో నెలకొంది.

సవాలక్ష నిబంధనలు.. 21.8 శాతమే నమోదు

జిల్లా రైతులు ఈ ఖరీఫ్‌లో వ్యవసాయ, ఉద్యాన, పట్టు వ్యవసాయం, సామాజిక అటవీ సాగు కలిపి 3.51 లక్షల ఎకరాల్లో సాగు చేశారు. రైతు పేరు, పంట, విస్తీర్ణం తదితర వివరాలను ఖాతా, సర్వే నంబర్ల వారీగా ఈ–పంట యాప్‌లో నమోదు చేయాలి. గతంలో సాగు చేసిన పంటల వివరాలను మాత్రమే నమోదు చేసేవారు. కానీ ఈసారి సాగులో లేని కమతాలను సైతం నమోదు చేయాలని నిబంధన కొత్తగా విధించారు. పంట సాగుచేయని పొలాల్లోనూ రైతులు ఫొటో దిగాల్సి వస్తోంది. పంటల సాగుతో పాటు బీడు భూముల వివరాలను నమోదు చేయిస్తున్నారు. రీసర్వే జరిగిన గ్రామాల్లో సబ్ డివిజన్ చేయకపోవడంతో జాయింట్ ఎల్పీ నంబర్లతోనే విస్తీర్ణం కనిపిస్తోంది. కొన్నిచోట్ల రెవెన్యూ సిబ్బంది సహకరించకపోవడంతో వ్యవసాయ సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. మారిన నిబంధనల ప్రకారం ఈసారి సర్వే నంబర్ల వారీగా జియో మ్యాపింగ్ చేసి, ఫొటో తీసి అప్‌లోడ్ చేయాలి. ఈ తతంగం పూర్తి కావడానికి ఎక్కువ సమయం పడుతోంది. సాంకేతిక సమస్యలతో ముందుకు కదలడం లేదు. బయోమెట్రిక్ పడని రైతులకు ఐరిస్ చేయడానికి సిగ్నల్ సమస్య వేధిస్తోంది. ఈసారి తోటల్లో గట్టు మీద పెంచే కొబ్బరి, తాటి చెట్లు, చింత, అల్లనేరేడు ఇతర రకాల చెట్లను ఈ–పంట చేయాలన్న నిబంధన విధించారు. ఇదంతా కష్టతరంగా మారినట్లు సంబంధిత ఉద్యోగులు చెబుతున్నారు. బీడు భూముల నమోదులో సవాలక్ష నిబంధనలు పొందుపరిచారు. కొత్త నిబంధనలతో జిల్లాలో ఈ–పంట నమోదు ప్రక్రియ ఆశించిన స్థాయిలో ముందుకు సాగడంలేదు. జిల్లాలో సాగు, బీడు భూములన్నీ కలిపి మొత్తం నమోదు చేయాల్సిన కమతాలు 17,30,843 కాగా ఇప్పటివరకు 3,77,528 మాత్రమే నమోదయ్యాయి. నమోదు శాతం 21.8 మాత్రమే. గడువు ఈ నెల 25 వరకు పొడిగించినా శతశాతం కమతాల నమోదు అసాధ్యంగా కనిపిస్తోంది. ఉన్నతాధికారులు వీఏఏ, ఏవో, వీఆర్వోల వంటి క్షేత్రస్థాయి సిబ్బందిపై ఒత్తిడి తెస్తున్నా ప్రభుత్వం మార్చిన కొత్త నిబంధనల కారణంగా వారంతా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



యలమంచిలి తెరువుపల్లిలో ఈ–పంట నమోదును పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

వెంటనే పూర్తి చేయాలి



ఈ–పంట నమోదు వెంటనే పూర్తి చేయాలి. అది పూర్తయితేనే పంటల బీమా గానీ పంట ఉత్పత్తులకు మద్దతు ధర గానీ పొందే అవకాశం ఉంటుంది. ఒకవైపు వరుసగా అల్పపీడనాలు, వాయుగుండాలు, భారీ వర్షాలు అంటూ వాతావరణ శాఖ ప్రకటిస్తోంది. దీంతో సాగు చేసిన పంటలకు నష్టం వాటిల్లుతుందన్న ఆందోళనలో ఉంటున్నాం. అధికారులు పూర్తిగా పంట నమోదు చేయాలి.

–గుర్రాల అప్పారావు, రాంనగర్, యలమంచిలి

నిబంధనలు సరళతరం చేయాలి



పంటల సాగులో అత్యంత కీలకమైన ఈ–పంట నమోదు మందకొడిగా సాగుతున్నట్టు లెక్కలు చూస్తే తెలుస్తోంది. ఎక్కడైనా ఉద్యోగుల నిర్లక్ష్యం వలన పంట నమోదు పూర్తి చేయకపోతే వారికే పంట నష్టం చెల్లింపు బాధ్యత ఉండేలా నిబంధన పెడితే ప్రక్రియ వేగవంతం అవుతుంది. ప్రభుత్వం ఈసారి సవాలక్ష కొత్త నిబంధనలు పెట్టింది. నిబంధనలు సరళతరం చేయాలి.

– కాళ్ల శ్రీనివాసరావు, పోతురెడ్డిపాలెం

నాలుగు పంచాయతీలకు స్వచ్ఛాంధ్ర అవార్డు



ఒంపోలులో స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా ప్రతిజ్ఞ చేస్తున్న సర్పంచ్ సూరప్పారావు, కార్యదర్శి హరనాథ్ తదితరులు (ఫైల్)

మునగపాక: స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర అవార్డుకు జిల్లాలోని నాలుగు పంచాయతీలు ఎంపికయ్యాయి. మునగపాక మండలంలోని ఒంపోలు, అనకాపల్లి మండలం మార్టూరు, అచ్యుతాపురం మండలం దిబ్బపాలెం, నర్సీపట్నం మండలం ధర్మసాగరం గ్రామాల్లో శుభ్రత, చెత్త సేకరణను పరిగణనలోకి తీసుకొని, సర్వే ఫలితాలను అనుసరించి పురస్కారాలకు ఎంపిక చేసినట్టు అధికారులు తెలిపారు.

నేడు అనకాపల్లిలో అవార్డుల బహూకరణ

జిల్లాలో స్వచ్ఛాంధ్ర అవార్డుకు ఎంపికైన గ్రామాలకు చెందిన సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు సోమవారం

మిగతా 8వ పేజీలో ▶

క్లుప్తంగా

తెలుగు కథల పోటీలు

యలమంచిలి రూరల్: తెలుగు భాషా పరిరక్షణ సమితి మూడేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా జిల్లా స్థాయి తెలుగు కథల పోటీలు నిర్వహించనున్నట్టు సమితి సమన్వయకర్త కొయిలాడ రామ్మోహన్‌రావు తెలిపారు. ఏదైనా అంశంపై 600 నుంచి 1000 పదాలకు మించకుండా కథ ఉండాలన్నారు. ఒకరు ఒక కథనే వంపాల్సి ఉంటుందని, పోటీదారులు పంపించే కథ వారి సొంతమేనని, దేనికీ అనువాదం, అనుసరణం కాదని, ఇదివరకు ప్రచురితం కాలేదని, అంతర్జాల మాధ్యమాల్లో పెట్టలేదని, ఏ పత్రిక పరిశీలనలో లేదని హామీపత్రం ఇవ్వాల్సి ఉంటుందన్నారు. 13 నుంచి 25 ఏళ్ల వయస్సు ఉన్న యువతీ యువకులెవరైనా ఈ పోటీల్లో పాల్గొనవచ్చని చెప్పారు. విజేతలకు నగదు బహుమతులు ఇవ్వనున్నట్టు తెలిపారు. మొదటి బహుమతిగా రూ.2,000, ద్వితీయ బహుమతి రూ.1,500, తృతీయ బహుమతిగా రూ.1,000తో పాటు ఒక్కొక్కరికీ రూ.500 చొప్పున ఐదు ప్రోత్సాహక బహుమతులు ఇవ్వనున్నట్టు చెప్పారు. విజేతలకు ఈ నెల 24 నుంచి నవంబరు 2వ తేదీ వరకు అనకాపల్లిలో జరగనున్న పుస్తక మహోత్సవంలో బహుమతులు అందజేస్తారు. కథను అక్టోబరు 20వ తేదీ లోపు 'కేఆర్ మోహన్ 230 ఎట్‌దిరేట్ జిమెయిల్.కామ్' మెయిల్‌కు గానీ, వాట్సాప్ నంబరు 9849345060కు గానీ పంపవచ్చు. వివరాలకు 9704811444, 9182873598, 9493641584 మొబైల్ ఫోన్ నంబర్లలో సంప్రదించవచ్చు.

అక్రమంగా తరలిస్తున్న 30 టన్నుల బియ్యం స్వాధీనం



విజిలెన్సు అధికారులు పట్టుకున్న బియ్యం

నాతవరం: లారీపై అక్రమంగా తరలిస్తున్న 30 టన్నుల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్టు విజిలెన్స్ ఎస్‌ఐ రవికుమార్ తెలిపారు. మండలంలో నర్సీపట్నం-తుని మధ్య ఆర్‌అండ్‌బీ రోడ్డులో ఎం.బి.పట్నం పంచాయతీ శివారు ఎ.శరభవరం సమీపంలో నర్సీపట్నం వైపు నుంచి లారీపై తరలిస్తున్న బియ్యాన్ని పట్టుకున్నట్టు చెప్పారు. ఎలాంటి అనుమతులు లేకుండా నిబంధనలు ఉల్లంఘించి తరలిస్తున్న బియ్యాన్ని స్వాధీనం చేసుకుని, డి.యర్రవరం పౌరసరఫరాల గిడ్డంగికి తరలించినట్టు చెప్పారు. అక్కడ సివిల్ సప్లైడిప్యూటీ తహశీల్దార్ చందన లేఖ ఆధ్వర్యంలో తూకం వేసి, అప్పగించామన్నారు. ఈ సంఘటనపై 6ఏ కేసు నమోదు చేసినట్టు డీటీ చందనలేఖ విలేకరులకు తెలిపారు.

రైలు నుంచి జారి పడి వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

పాయకరావుపేట: పట్టణంలోని చక్కానగర్ వెనుక వైపు గల రైలు పట్టాలపై గుర్తుతెలియని వ్యక్తి(40) మృతదేహం లభ్యమైనట్టు తుని రైల్వే పోలీసు ఎస్‌ఐ జి.శ్రీనివాసరావు ఆదివారం తెలిపారు. నీలం రంగుపుల్ చేతుల బనియన్, సిమెంట్ రంగు ఫ్యాంట్ ధరించి ఉన్నాడని చెప్పారు. గుర్తు తెలియని రైలు నుంచి జారిపడి మృతి చెందినట్టు తెలిపారు. మృతదేహాన్ని తుని ఏరియా ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచినట్టు చెప్పారు. వివరాలు తెలిసిన వారు సెల్ నంబర్ 9490619020కు తెలియపరచాలని శ్రీనివాసరావు కోరారు.

ఉత్సాహంగా సాఫ్ట్‌బాల్ పోటీలు

గొలుగొండ: కృష్ణదేవిపేట (ఏఎల్‌పురం) గ్రామంలో రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు రెండో రోజు ఆదివారం ఉత్సాహంగా జరిగాయి. మూడు రోజులపాటు జరుగుతున్న అండర్-14 సాఫ్ట్‌బాల్ పోటీల్లో రాష్ట్రం నలుమూలల నుంచి 13 బాలికల జట్లు, 13 బాలుర జట్లు పాల్గొంటున్నాయి. ఆదివారం విజయనగరం, గుంటూరు, కడప, శ్రీకాకుళం, విశాఖ జిల్లాల జట్ల మధ్య హోరాహోరీగా పోటీలు జరిగాయి.

కుండపోత



రోలుగుంటలో ఇంటిలోకి ప్రవేశించిన నీరు



రోలుగుంటలో రోడ్డుపైనే పారుతున్న వర్షం నీరు



రోలుగుంటలో కురుస్తున్న వర్షం



చోడవరం పట్టణంలో రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షం నీరు



జలమయంగా మారిన వీధి

- లోతట్టు ప్రాంతాలు జలమయం
- బీఎన్ రోడ్డుపై భారీగా ట్రాఫిక్‌జామ్

చోడవరం: జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఆదివారం భారీ వర్షం కురిసింది. చోడవరం మండలంలో సాయంత్రం ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై సుమారు రెండు గంటలపాటు ఎడతెరిపిలేకుండా వర్షం పడింది. 28 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. భారీ వర్షం కారణంగా చోడవరం పట్టణంలో లోతట్టు ప్రాంతాలైన పూర్ణాథియేటర్ రోడ్డు, బానీకోనేరు, బాలాజీనగర్, రెల్లివీధి, ఆంధ్రాబ్యాంక్ జంక్షన్, కొత్తూరు జంక్షన్, పాతబస్టాండ్ ప్రాంతాలు నీట మునిగాయి. రోడ్లపై వర్షంనీరు పొంగి ప్రవహించింది. పూర్ణాథియేటర్ వద్ద మోకాళ్ల లోతు నీరు నిలిచిపోయింది. థియేటర్‌లోకి సైతం నీరు ప్రవేశించింది. దీంతో సినిమాకి వచ్చిన ప్రేక్షకులు ఇబ్బంది పడ్డారు. మరో పక్కరోడ్లపై నీరు ప్రవహిస్తుండడంతో వాహనచోదకులు, పాదచారులు భయంభయంగా రాకపోకలు సాగించారు. బాలాజీనగర్‌లో లోతట్టు ప్రాంతంలో ఉన్న ఇళ్లల్లోకి నీరు చేరడంతో వర్షపునీటిని బయటకు పంపేందుకు నానా అవస్థలు పడ్డారు.

చెరువులను తలపించేలా...

బీఎన్‌రోడ్డులో వడ్డాది- చోడవరం-వెంకన్నపాలెం రహదారిలో ఉన్న గోతుల్లో వర్షపునీరు చేరి చెరువులను తలపించాయి. దీంతో సుమారు 11కిలోమీటర్ల మేర వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. రాత్రి 7.30గంటల వరకూ దారి పొడవునా భారీ సంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. బస్సులు, ఆటోలు, లారీలు, ద్విచక్రవాహనాలు ట్రాఫిక్‌లో చిక్కుకుపోయాయి. విశాఖపట్నం, పాడేరు, నర్సీపట్నం, అనకాపల్లి తదితర దూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు అవస్థలకు గురయ్యారు.

యలమంచిలి రూరల్: యలమంచిలి పట్టణం, మండల వ్యాప్తంగా ఆదివారం రాత్రి భారీ వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులు, పిడుగులతో కూడిన భారీ వర్షం పడడంతో ప్రజలు భీతిల్లారు. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండడంతో పట్టణంలో ప్రధాన రహదారులు సహా అంతర్గత రహదారులపై వర్షపునీరు నిలిచిపోయింది. బస్సులు సకాలంలో రాకపోవడంతో పట్టణంలో ఆర్టీసీ బస్ కాంప్లెక్స్‌లో పెద్ద సంఖ్యలో ప్రయాణికులు గంటల తరబడి నిరీక్షించారు. రాజీవ్ క్రీడామైదానం చెరువులా మారిపోయింది. టిఫిన్లు, భోజనాలకోసం హోటళ్లకు వెళ్లేవారంతా తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. సాగులో ఉన్న వరి, వివిధ ఉద్యానవన పంటలకు వర్షం మేలు చేస్తుందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రోలుగుంట: మండలంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం భారీ వర్షం కురిసింది. మండల కేంద్రం రోలుగుంటలో పలు వీధులు జలమయమయ్యాయి. లోతట్టు ప్రాంతాలైన బండారు వీధి, అల్లువారి వీధి, ఎరుకుల వీధిల్లోని పలు ఇళ్లలోకి వర్షం నీరు ప్రవేశించింది. ఆర్‌అండ్‌బీ రోడ్డుపై నీరు భారీగా ప్రవహించడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. కాలువలు పూడుకుపోవడం వర్షం నీరు ఎక్కడికక్కడ నిలిచిపోయింది. కొండపాలెం, వెలంకాయలపాలెం, కొవ్వూరు తదితర గ్రామాల్లో కుండపోతగా వర్షం పడింది.

పేట డైవర్షన్ రోడ్డులో ఆటోలు బోల్తా

- పలువురికి గాయాలు
- వడ్డాది పెద్దేరు వంతెనపై ట్రాఫిక్ జామ్
- ప్రయాణికుల అవస్థలు



వడ్డాది పెద్దేరు వంతెనపై ట్రాఫిక్‌లో చిక్కుకున్న 108 అంబులెన్స్



పేట తాచేరు డైవర్షన్ రోడ్డుపై నుంచి నదిపైపు బోల్తా పడిన ప్రయాణికుల ఆటో



పేట తాచేరు వంతెనపై బోల్తాపడిన తొట్టె ఆటో

బుచ్చెయ్యపేట: అస్తవ్యస్తంగా ఉన్న భీమునిపట్నం, నర్సీపట్నం(బీఎస్) రోడ్డులో తరచూ ప్రమాదాలు జరుగుతుండడంతో ప్రయాణికులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. తాజాగా ఆదివారం విజయరామరాజుపేట తాచేరు వంతెనపై ఏర్పాటు చేసిన డైవర్షన్ రోడ్డుపై ఆటో బోల్తా పడగా, అందులో ప్రయాణిస్తున్న పలువురు తాచేరు నదిలో పడి, స్వల్ప గాయాలతో బయట పడ్డారు. రెండు నెలలు కిందట వర్షాలకు కొట్టుకుపోయిన తాచేరు డైవర్షన్ రోడ్డు మరమ్మతు పనులు రూ.15 లక్షలతో చేపట్టారు. సిమెంట్ పైపులు, వాటిపై గ్రావెల్ వేశారు. అయితే సరిగా రోలింగ్ చేయకుండా వదిలేశారు. పనులు పూర్తి స్థాయిలో చేయకుండానే శనివారం సాయంత్రం నుంచి వాహనాలు వెళ్లేలా బారికేడ్లు తీసివేశారు. దీంతో పలువురు వాహనదార్లు డైవర్షన్ రోడ్డుపై నుంచి రాకపోకలు సాగించారు. తాచేరు నదిపై కొత్తగా వేసిన డైవర్షన్ రోడ్డు గోతుల్లో పడి ప్రయాణికులతో వస్తున్న ఆటో బోల్తా పడింది. ప్రయాణికులు నదిలో పడిపోయారు. నీటి ప్రవాహం తక్కువగా ఉండడంతో ఆటో డ్రైవర్, పలువురు ప్రయాణికులు గాయాలతో బయటపడ్డారు. ఇదే ప్రదేశంలో మరో తొట్టె ఆటో బోల్తా పడింది. స్థానికుల సహకారంతో బోల్తా పడిన ప్రయాణికుల ఆటోతో పాటు గూడ్స్ ఆటోను బయటకు తీశారు. డైవర్షన్ రోడ్డు పనులు పూర్తి చేయకుండానే వాహనాలను అనుమతించడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పది రోజుల కిందట పేట డైవర్షన్ రోడ్డుపై నుంచి తాచేరు నదిలో పడిపోయి కొట్టుకుపోయి పేట గ్రామానికి చెందిన 8వ తరగతి విద్యార్థి, వడ్డాదికి చెందిన రైతు మృతి చెందిన విషయం తెలిసిందే.

వడ్డాది పెద్దేరు వంతెనపై ట్రాఫిక్ జామ్

మేజర్ పంచాయతీ వడ్డాది పెద్దేరు వంతెనపై ఆదివారం ట్రాఫిక్ జామ్ అయింది. కిలోమీటరు దూరం వరకు వాహనాలు నిలిచిపోయాయి. ఆదివారం వడ్డాది సంత కావడంతో పలు గ్రామాల నుంచి వచ్చిన వ్యాపారులు, కొనుగోలుదారులతో పాటు పలు ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులతో వడ్డాది రోడ్డు నిండిపోయింది. వడ్డాది పెద్దేరు నదిపై ఉన్న పాత బ్రిడ్జితో పాటు పక్క నుంచి వేసిన డైవర్షన్ రోడ్డుపైన ట్రాఫిక్ జామ్ అయింది. పాడేరు నుంచి అనకాపల్లి వైపు వెళ్తున్న 108 వాహనం ట్రాఫిక్‌లో చిక్కుకుపోయింది. స్థానికులు సాయంతో వాహనాలను పక్కకు తీయించి 108 వెళ్లేలా రహదారి కల్పించారు. ప్రతి ఆదివారం వడ్డాదిలో ట్రాఫిక్ జామ్ జరిగి, పలువురు ఇబ్బందులు పడుతున్నా పోలీసులు చర్యలు చేపట్టడం లేదని స్థానికులు మండిపడుతున్నారు.

నాలుగు పంచాయతీలకు స్వచ్ఛాంధ్ర అవార్డు

▶7వ పేజీ తరువాయి

పురస్కారాలు అందిస్తారు. అనకాపల్లిలోని పెంటకోట కన్వెన్షన్ హాల్లో మధ్యాహ్నం 3 గంటలకు జరిగే కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి, ఉన్నతాధికారుల చేతుల మీదుగా పురస్కార ప్రదానం జరుగుతుంది.

సమష్టి కృషితోనే అవార్డుకు ఎంపిక..: ఒంపోలులో ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయం చేసుకుంటూ గ్రామాన్ని అభివృద్ధి చేస్తూ వస్తున్నారు. పక్కాగా చెత్త సేకరిస్తూ, గ్రామాన్ని ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచడంతో స్వచ్ఛాంధ్ర అవార్డుకు ఒంపోలు ఎంపికైంది. కేంద్ర, రాష్ట్ర బృందాలు గతంలో గ్రామంలో నిర్వహించిన సర్వేలు అనుకూలంగా రావడం, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయడం వలన స్వచ్ఛాంధ్ర అవార్డుకు ఒంపోలు ఎంపికైందని ఈవోఆర్డీ సోమరాజు తెలిపారు. తమ గ్రామానికి గుర్తింపు రావడం సంతోషంగా ఉందని ఒంపోలు సర్పంచ్ గనిరెడ్డి సూరప్పారావు, పంచాయతీ కార్యదర్శి హరనాథ్ చెప్పారు.

'రైవాడ' నుంచి 1000 క్యూసెక్కుల నీరు విడుదల



వరదనీటితో కళకళలాడుతున్న రైవాడ జలాశయం

దేవరాపల్లి: ఇటీవల కురుస్తున్న వర్షాలకు రైవాడ జలాశయంలోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. ప్రస్తుతం జలాశయంలోకి 950 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరడంతో జలాశయం స్పిల్ వే గేటు ద్వారా 1000 క్యూసెక్కుల నీటిని శారదానదిలోకి విడుదల చేస్తున్నారు. జలాశయం గరిష్ఠ నీటిమట్టం 114 మీటర్లు కాగా ప్రస్తుతం 112.90 మీటర్లకు చేరుకుంది. నీటి నిల్వలతో జలాశయం నిండు కుండలా దర్శనమిస్తోంది. ఇన్‌ఫ్లో ఆధారంగా గేట్ల ద్వారా నీటి విడుదలను పెంచడం లేదా తగ్గించడం జరుగుతుందని, శారదానది పరీవాహక ప్రాంత గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జలాశయం డీఈఈ జి.సత్యంనాయుడు తెలిపారు.

బియ్యం సరఫరాలో కూటమి ప్రభుత్వం విఫలం

రేషన్ కార్డుదారులకు పంపిణీలో జాప్యం



నాతవరం మండలం డి.యర్రవరం పౌరసరఫరాలశాఖ గోదాంలో అరకొరగా ఉన్న బియ్యం

నాతవరం: రేషన్ డిపోలకు బియ్యం సరఫరా చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమవుతోంది. దీంతో ఇటు డీలర్లకు, అటు కార్డుదారులకు ఇక్కట్లు తప్పడం లేదు. నర్సీపట్నం రెవెన్యూ డివిజన్‌లో ఆదివారం నాటికి 200 పైగా రేషన్‌డిపోలకు బియ్యం సరఫరా కాలేదు. నర్సీపట్నం ఎంఎల్‌సీ పాయింట్ పరిధిలో గల నర్సీపట్నం, గొలుగొండ, మాకవరపాలెం, రోలుగుంట, కోటవురట్ల మండలాల్లో గల 125 పైగా డిపోలకు పూర్తిగా(260 టన్నుల) బియ్యం అందలేదు. నాతవరం మండలంలో 42 రేషన్ డిపోలుండగా వీటిలో ఐదు డిపోలకు పూర్తిగా (30 టన్నుల) బియ్యం సరఫరా చేయలేదు. అరకొరగా వచ్చిన బియ్యాన్ని లబ్ధిదారులకు అందజేయడంలో డీలర్లు ఇబ్బందులకు గురవుతున్నారు. బియ్యం అందని రేషన్‌కార్డు దారులు వాగ్వాదాలకు దిగుతున్నారు. రావికమతం మండలానికి 140 టన్నులు, పాయకరావుపేట మండలానికి 200 టన్నులు ఇంకా సరఫరా చేయవలసి ఉంది. ప్రతి నెల 25 తేదీ నుంచే రేషన్ బియ్యాన్ని జిల్లా వ్యాప్తంగా మండలాలకు తరలిస్తుంటారు. మండలాల్లోని గోదాముల నుంచి గ్రామాల్లో రేషన్ దుకాణాలకు నేలాఖరున పంపుతారు. అయితే ఈ సారి బియ్యం సరఫరాలో తీవ్ర జాప్యం జరిగింది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సకాలంలో బియ్యం సరఫరా చేసేందుకు చర్యలు చేపట్టాలని కార్డుదారులు కోరుతున్నారు. ఈవిషయంపై జిల్లా పౌరసరఫరాల శాఖ డీఎంను ఫోన్‌లో సంప్రదించేందుకు ప్రయత్నించగా స్పందించలేదు.

ఆరు పదులు... ఆనందానికి లేవు హద్దులు




అచ్యుతాపురం మండలం చోడపల్లి వద్ద సందడి చేసిన మునగపాక హైస్కూల్ 1980 పదవ తరగతి బ్యాచ్ విద్యార్థులు

- చోడపల్లిలో 1980 బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ కలయిక

అచ్యుతాపురం: వారంతా ఆరు పదుల వయస్సు దాటిన వారే.. కొందరు తాతలు, మరి కొందరు ముత్తాతలయ్యారు. కొందరు విశ్రాంత జీవనం సాగిస్తున్నారు. 45 ఏళ్ల కిందట వారంతా ఒక బడిలో చదువుకున్నారు. ఆదివారం కలుసుకుని, బాల్యస్నేహితులను తనివితీరా చూసి, నాటి జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. ఈ ఆత్మీయ కలయికకు మండలంలోని చోడపల్లిలో చోడమాంబిక అమ్మవారి ఆలయ పరిసర ప్రాంతం వేదికైంది. మునగపాక ఉన్నత పాఠశాలలో 1980లో పదవ తరగతి చదువుకున్న విద్యార్థులు అచ్యుతాపురం మండలంలోని చోడపల్లిలో కలుసుకుని సందడి చేశారు. 33 ఏళ్లుగా ప్రతీ సంవత్సరం క్రమం తప్పకుండా వీరు కలుస్తున్నారు. ఈ సందర్భంగా బ్యాచ్‌లో ఉన్నత స్థానాల్లో ఉండి పదవీ విరమణ పొందిన వారిని సత్కరించారు. స్టీల్ ప్లాంట్, వైద్య, విద్యా శాఖల్లో పనిచేసి పదవీ విరమణ చేసిన వారంతా తమ ఉద్యోగంలో అనుభవాలు, ఇతర విషయాలను వివరించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం డీఎంవో పి.సత్యనారాయణ, జీవీఎంసీ ఎంటమాలజిస్ట్ డి.సాంబమూర్తి, పీడీగా పదవీ విరమణ పొందిన పెంటకోట రాము, హరిపాలెం పీహెచ్‌సీ సూపర్‌వైజర్ ఎస్. శ్రీను, కొండకర్ల నీటి సంఘం మాజీ అధ్యక్షుడు బి.వి.రాము, అచ్యుతాపురం మాజీ జెడ్పీటీసీ జనపరెడ్డి శ్రీనివాసరావు, ఎస్.సత్యనారాయణ, కె.పి.రావు, ఎ.వి.ఎస్.అప్పారావు, సీహెచ్ పారునాయుడు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి గాయాలు



ప్రమాదంలో గాయపడిన యువకులు

రావికమతం: మండలంలోని పి.పొన్నవోలు సమీపంలో బి.ఎన్.రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. ఎదురుగా వస్తున్న కారును తప్పించబోయే క్రమంలో ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. కొత్తకోట ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రోలుగుంట మండలం కొమరవోలుకు చెందిన బండారు మనోవరాహ వినయ్, వంటాకుల మదన్‌కుమార్, బండారు తేజ శనివారం రాత్రి ద్విచక్ర వాహనంపై రావికమతం వైపు నుంచి స్వ గ్రామం కొమరవోలు వెళుతున్నారు. అదే సమయంలో టి.అర్జాపురానికి చెందిన ఆర్.జనార్దన్, మత్స్యవానిపాలెంకు చెందిన ఆదాడ సాయి ద్విచక్ర వాహనంపై మేడివాడ వైపు వెళున్నారు. పి.పొన్నవోలు దగ్గర ఎదురుగా వస్తున్న కారును తప్పించే క్రమంలో ఎదురెదురుగా వస్తున్న వాహనాలు బలంగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఐదుగురు యువకులు గాయపడ్డారు. కొమరవోలుకు చెందిన యువకులు విశాఖ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మత్స్యవానిపాలెం యువకుడు నర్సీపట్నంలోని ప్రైవేటు ఆస్పత్రిలో, టి.అర్జాపురానికి చెందిన యువకుడు విశాఖపట్నంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

జీఎస్టీ తగ్గింపు ధరలు అమలు చేయాలి

అనకాపల్లి: జీఎస్టీ తగ్గింపు ధరలు పూర్తిస్థాయిలో అమలు చేయాలని, కేంద్ర ప్రభుత్వ ఆదేశాలమేరకు వస్తువుల పాత, కొత్త రేట్లతో ప్రతి వ్యాపార సంస్థ బోర్డులు ఏర్పాటు చేయాలని కన్స్యూమర్ ఆర్గనైజేషన్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కాండ్రేగుల వెంకటరమణ డిమాండ్ చేశారు. స్థానిక ప్లబిక్ ఫోరం కార్యాలయంలో జీఎస్టీ తగ్గింపు ప్రయోజనాలు-వినియోగదారుల హక్కులు అంశంపై ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపు క్షేత్ర స్థాయిలో అమలు కావడం లేదన్నారు. దీంతో ఆ ప్రయోజనాలు వినియోగదారులకు అందడం లేదన్నారు. ధరలను అదుపు చేయాల్సిన అధికార యంత్రాంగం మొక్కుబడిగా అవగాహన సమావేశాలు నిర్వహించి చేతులు దులుపుకుంటోందని ఆరోపించారు. క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే జీఎస్టీ ఎంత తగ్గుతుందో తెలుస్తుందని చెప్పారు. జీఎస్టీ బిల్లు కోసం విధిగా వినియోగదారులు డిమాండ్ చేయాలన్నారు. ఈ సమావేశంలో కన్స్యూమర్ రైట్స్ సేఫ్ గార్డింగ్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు రెడ్డి సత్యనారాయణ(పరవాడ), వినియోగదారుల మండలి అధ్యక్షుడు ఎస్. నూకరాజు(రాంబిల్లి), వివిధ మండలాల వినియోగదారుల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

విత్తన బంతులతో వెల్లివిరిసే పచ్చదనం



విత్తన బంతులు విసిరే కార్యక్రమంలో పాల్గొన్న గ్రీన్ క్లబ్ సభ్యులు

అనకాపల్లి: నేటి విత్తనాలే రేపటి మహా వృక్షాలని జిల్లా అటవీశాఖ అధికారి ఎం.సోమసుందర్ పేర్కొన్నారు. స్థానిక సత్యనారాయణస్వామి దేవస్థానం కొండపై నుంచి విత్తన బంతులు విసిరే కార్యక్రమం పట్టణ గ్రీన్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పచ్చదనాన్ని పెంచడానికి విత్తన బంతులు విసిరే కార్యక్రమం ప్రభావంతమైన పద్ధతని, ముఖ్యంగా కొండ ప్రాంతాలలో చాలా ఉపయోగాలు ఉంటాయన్నారు. భావితరాలకు పర్యావరణపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సత్యనారాయణస్వామి దేవస్థానం చైర్మన్ అప్పికొండ గణేష్, క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు కొణతాల ఫణిభూషణ్ శ్రీధర్ మాస్టారు, విశ్రాంత అటవీశాఖాధికారి బీరా వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బెల్టు షాపులపై సీపీఎం దశలవారీ ఉద్యమం

దేవరాపల్లి: గ్రామాల్లో విచ్చలవిడిగా నడుస్తున్న మద్యం బెల్టు షాపులపై దశలవారీగా ఉద్యమం చేపడతామని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు డి వెంకన్న, మండల కార్యదర్శి బి.టి.దొర పేర్కొన్నారు. దేవరాపల్లిలోని సీఐటీయూ కార్యాలయంలో సీపీఎం విస్తృత స్థాయి సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకన్న, దొర మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా గ్రామాల్లోని ప్రతీ వీధిలోని పాన్‌షాపులు, దాబాలు టీ దుకాణాల్లో సైతం మద్యం విక్రయాలు యథేచ్ఛగా జరుగుతున్నాయన్నారు. అధికారులు చర్యలు తీసుకోకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. గ్రామాల్లో అనధికారిక వేలం పాటలు నిర్వహించి, ఎమ్మార్పీ ధరల కంటే అధిక మొత్తానికి విక్రయించి దోచుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల్లో విచ్చలవిడిగా మద్యం అమ్మకాలతో గ్రామాల్లో యువత మద్యానికి బానిసై పెడదారి పడుతున్నారన్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని, లేకుంటే దశలవారీగా ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో బి.నాగేశ్వరరావు, డి.శంకర్, సిహెచ్. దేముడు, జె.ఈశ్వరరావు, వి.దొంగబాబు, తదితర సీపీఎం శ్రేణులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న నిర్బంధాలు

- 22వ రోజుకు చేరిన మత్స్యకారుల దీక్ష
- సంఘీభావం తెలిపేందుకు వస్తున్న నేతలకు అడ్డంకులు



ఎస్.రాయవరం: ధర్మవరం అగ్రహారంలో సీపీఎం నాయకుడు అప్పలరాజు గృహ నిర్బంధం



నక్కపల్లి: రాజయ్యపేట వస్తున్న బోడే రామ చంద్రయాదవ్‌ను అడ్డుకున్న పోలీసులు

నక్కపల్లి/ఎస్.రాయవరం: రాజయ్యపేట సమీపంలో బల్క్‌డ్రగ్ పార్క్ నిర్మాణాన్ని నిలిపివేయాలని మత్స్యకారులు చేస్తున్న నిరాహారదీక్ష ఆదివారం 22వ రోజుకు చేరుకుంది. వారికి సంఘీభావం తెలిపేందుకు వస్తున్న నాయకుల నిర్బంధం ఇప్పటికీ కొనసాగుతోంది. బీసీవై పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బోడే రామచంద్రయాదవ్ మత్స్యకారుల దీక్షకు మద్దతుగా రాజయ్యపేట వస్తుంటే రాజమండ్రి సమీపంలో పోలీసులు అడ్డుకున్నారు. దీక్షలో పాల్గొనకుండా సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.అప్పలరాజును ఎస్.రాయవరం మండలం ధర్మవరం అగ్రహారంలో ఇంటి వద్ద పోలీసులు గృహ నిర్బంధం చేశారు. బల్క్‌డ్రగ్ పార్క్‌కు మద్దతుగా రాంబిల్లిలో ఐద్వా ఆధ్వర్యంలో మహిళలు నిరసన కార్యక్రమం నిర్వహించారు.

నూతన ఉపాధ్యాయులకు ఇండక్షన్ శిక్షణ



యోగాసనాలు వేస్తున్న నూతనంగా ఎంపికైన ఉపాధ్యాయులు

సబ్బవరం: దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయంలో 'మెగా డీఎస్సీ - 2025' ద్వారా నూతనంగా ఎంపికైన ఉపాధ్యాయుల కోసం ప్రభుత్వం ఇండక్షన్ శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందిన సుమారు 400 మంది సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు ఈ నెల 3 నుంచి 10వ తేదీ వరకు వారం రోజుల పాటు రెసిడెన్షియల్ పద్ధతిలో శిక్షణ ఇస్తున్నట్లు అనకాపల్లి జిల్లా విద్యాశాఖాధికారి గిడ్డి అప్పారావు నాయుడు తెలిపారు. శిక్షణలో భాగంగా ఆదివారం ఉపాధ్యాయులకు యోగా, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. శిక్షణ సమర్థవంతంగా జరిగేందుకు పర్యవేక్షక కమిటీలు, వైద్య సదుపాయాలు ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

క్లుప్తంగా

ప్రతి నెలా సేవా కార్యక్రమాలు



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

అనకాపల్లి టౌన్: ప్రజలందరూ ఉచిత మెడికల్ క్యాంప్‌లను సద్వినియోగం చేసుకోవాలని పట్టణ రోటరీ క్లబ్ అధ్యక్షుడు బుద్ద శ్రీనివాస రావు తెలిపారు. స్థానిక న్యూకాలనీ రోటరీ హాల్‌లో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంప్ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నెలా జరిగే సేవా కార్యక్రమాల్లో ప్రజలందరూ పాల్గొనాలన్నారు. ఈ క్యాంప్‌లో విశాఖపట్నం కేర్ హాస్పిటల్ వైద్యులు వంద మంది రోగులకు బీపీ, సుగర్, కంటి, దంత పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో క్లబ్ సీనియర్ సభ్యులు కోరుకొండ బుచ్చిరాజు, కార్యదర్శి కేవీపీఎస్ ప్రకాష్‌రావు, కోశాధికారి బీ సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

హిందూ ధర్మ పరిరక్షణకు కృషి



మాట్లాడుతున్న విశ్రాంత శాస్త్రవేత్త శివాజీ

మునగపాక: ప్రతి ఒక్కరూ హిందూ ధర్మ పరిరక్షణకు పాటుపడాలని ఆర్‌ఎస్‌ఎస్ ప్రతినిధి, విశ్రాంత శాస్త్రవేత్త శివాజీ కోరారు. స్థానిక నందీశ్వర ప్రాంగణంలో ఆదివారం రాత్రి ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హిందూ మతాన్ని రక్షించడం కోసం ఆర్‌ఎస్‌ఎస్ స్థాపించారన్నారు. 60 వేల సంఘాలు ప్రపంచంలో ఉన్నాయన్నారు. విశ్రాంత హెచ్‌ఎం ఐనాల అప్పారావు, డాక్టర్ బద్దెం సూర్యనారాయణ, మళ్ల కాలేశ్వరరావు, భాస్కరరావు, వాసు, వేగి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

హెడ్‌కానిస్టేబుల్ నిజాయితీ



బాధితుడి బ్యాగ్‌ను అందిస్తున్న హెచ్‌సీ డీకేవీ స్వామి

పెందుర్తి: మండలంలోనివేపగుంట ప్రాంతానికి చెందిన డొంతుకూరి వెంకటసత్యనారాయణమూర్తి ఈ నెల 3న తన ద్విచక్ర వాహనంపై పాయకరావుపేట నుంచి స్వగ్రామానికి వస్తుండగా మార్గమధ్యలో నగదు, గృహోపకరణాలతో కూడిన బ్యాగ్ జారిపోయింది. అదే మార్గంలో వస్తున్న పెందుర్తి పోలీస్ స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న డీకేవీ స్వామి ఆ బ్యాగ్‌ను గుర్తించారు. అందులో ఉన్న అడ్రస్ ఆధారంగా సదరు వ్యక్తిని స్టేషన్‌కు పిలిపించి బ్యాగులో ఉన్న రూ.3,600 నగదు, గృహోపకరణాలను ఆదివారం అందించారు. పోయిన నగదు బ్యాగ్ అందించిన హెడ్‌కానిస్టేబుల్ స్వామిని కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టేలా వ్యవహరించిన హెడ్‌కానిస్టేబుల్ స్వామిని పోలీసు ఉన్నతాధికారులు అభినందించారు.

8న మండల సర్వసభ్య సమావేశం

కశింకోట: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 8న ఉదయం 10.30 గంటలకు జరగనుందని ఎంపీడీవో సిహెచ్. చంద్రశేఖరరావు తెలిపారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ కలగా లక్ష్మి అధ్యక్షతన జరిగే సమావేశానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు, సిబ్బంది హాజరు కావాలని కోరారు.

అనకాపల్లి సినిమాలు

రాజా	:ఇడ్లీ కొట్టు
సత్యనారాయణ స్క్రీన్-1	: కాంతార
సత్యనారాయణ స్క్రీన్-2	: టన్నెల్
పర్తిసాయి	: ఓజీ
షిర్డీసాయి	: ఓజీ
వెంకటేశ్వర	: కాంతార
రామచంద్ర	: మిరాయ్

రక్త నిల్వలు

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 32 యూనిట్ల రక్త నిల్వ ఉంది. ఏ పాజిటివ్-9, బీ పాజిటివ్-6, ఓ పాజిటివ్-12, ఏబీ పాజిటివ్-5 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంక్ టెక్నీషియన్ యూ లోకేష్(9703613706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శనివారం 250 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 196 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి (08924-223595)ని సంప్రదించవచ్చు.

పరిష్కార 'మార్గం' ఏదీ?



కశింకోటలో ప్రభుత్వ పశువైద్యశాల

- అధ్వానంగా పశువైద్య శాల రోడ్డు
- కాలువను తలపిస్తున్న నిల్వ నీరు
- పాడిరైతులు, సిబ్బందికి ఇబ్బందులు



కాలువను తలపిస్తున్న కశింకోట పశువుల ఆస్పత్రికి వెళ్లే రోడ్డు

కశింకోట: స్థానిక ప్రభుత్వ పశు వైద్యశాలకు వెళ్లాలంటే పాడిరైతులకు ఇక్కట్లు తప్పడం లేదు. ఇక్కడ దారి నిండా నీరు చేరి పంట కాలువను తలపిస్తోంది. ఎక్కువ రోజులు నీటిలోనే మునిగి ఉంటోంది. వర్షం వస్తే మరింత ముంపునకు గురవుతోంది. దీంతో వైద్య సేవకు పశువులు, కుక్కలు, కోళ్లను తీసుకు వచ్చే ప్రజలు నిత్యం నరకయాతన అనుభవించాల్సిన పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని విమర్శిస్తున్నారు.

కశింకోటలోని పశు వైద్యశాలను వందేళ్ల క్రితం ఏర్పాటు చేశారు. దశాబ్దం క్రితం వరకు మండలానికి ఒకటే పశు వైద్య కేంద్రం ఉండేది. కాలక్రమేణా నరసింగబిల్లి, కన్నూరుపాలెం గ్రామీణ పశు వైద్య కేంద్రాలను ఆస్పత్రులుగా మార్పు చేసి నిర్వహిస్తున్నారు. దీంతో ఇక్కడి ఆస్పత్రి పరిధి తగ్గినప్పటికి మండల పశు వైద్యశాలగా కొనసాగుతోంది. ఇక్కడికి రోజుకు 50 వరకు గేదెలు, ఆవులు, గొర్రెలు, మేకలు, కోళ్లు, కుక్కలు వగైరా పశువులకు వైద్య సేవలందిస్తున్నారు. అయితే జాతీయ రహదారి పక్కన లోపలకు ఉన్న పశువుల ఆస్పత్రికి రాకపోకలు సాగించడానికి ఉన్న సిమెంట్ రోడ్డు నిత్యం నీటితో మునిగి ఉంటోంది. పంట కాలువను తలపిస్తోంది. మోకాళ్లలోతు నీరు నిల్వ ఉంటోంది. వర్షం వస్తే మరింత ముంపులో ఉంటోంది. పశువుల శాల పక్కన ఉన్న లోతట్టు ప్రాంతం నుంచి నీరు వచ్చి పోయే మార్గం లేక నిల్వ ఉండిపోతోంది. దీంతో వైద్య శాలకు రాకపోకలు సాగించడానికి వైద్యులు, సిబ్బంది, రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బంది చెందాల్సిన పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. దీని పక్కనున్న ఇళ్లు కూడా పోయే మార్గం లేక నీటి ముంపునకు గురవుతుండటంతో వాటిలో నివాసం ఉండే ప్రజలు వర్షం వచ్చిందంటే తీవ్ర ఇబ్బంది చెందుతున్నారు. వర్షం నీరు వెళ్లే మార్గం సరిగ్గా లేక పోవడం ఈ దుస్థితికి కారణం.



జాతీయ రహదారి మదుం వద్ద మార్గం మూసివేతతో నిల్వ ఉండిపోతున్న నీరు



గోవిందరావు కాలనీ వైపు మట్టితో మూసివేసి ఉన్న జాతీయ రహదారి మదుం మార్గం

వర్షాకాలంలో రోజుల తరబడి నిల్వ..

జాతీయ రహదారికి ఉన్న మదుం కింద నుంచి నీరు పోవడానికి మార్గం ఉంది. దీన్ని గోవిందరావు కాలనీ వైపు రోడ్డుకు అవతలి వైపు మట్టి అడ్డంగా వేసి మూసి వేశారు. దీంతో నీరు వెళ్లకుండా ఆస్పత్రి వైపు, మదుం వద్ద నీరు నిలిచిపోయి నిల్వ ఉండిపోతోంది. అది వర్షాకాలంలో రోజుల తరబడి నిల్వ ఉంటోంది. ఇక వర్షం పడితే వుండు మీద కారంలా మరింతగా నీటిలోనే మునిగి ముంపు కలిగిస్తోంది. దీనివల్ల రాకపోకలకు నరకయాతన అనుభవిస్తున్నారు. కొందరు పక్కనున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లోపలి నుంచి పశువుల ఆస్పత్రికి చేరుకోవలసిన పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. ఈ విషయమై అధికారుల దృష్టికి ఎన్నిసార్లు తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. దీంతో ఇబ్బంది పడక తప్పడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి నీరు పోయే మార్గాన్ని ఏర్పాటు చేసి తమ ఇబ్బందులను తొలగించడానికి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



పశు వైద్యశాల పక్కన కాలనీ చుట్టూ చేరిన వర్షపు నీరు

వర్షపు నీరు పోయే మార్గాన్ని కప్పేశారు



కశింకోటలో జాతీయ రహదారి మదుం వద్ద వర్షపు నీరు వెళ్లే మార్గంలో గోవిందరావు కాలనీ వైపు మట్టివేసి మూసి వేశారు. దీని వల్ల వర్షపు నీరు దిగువకు పారకుండా నిల్వ ఉండిపోతోంది. దీంతో ఏ మాత్రం వర్షం పడినా పశువైద్యశాలతోపాటు పక్కనున్న మా ఇళ్లు నీటి ముంపునకు గురై తీవ్ర ఇబ్బంది పడాల్సి వస్తోంది. ఈ విషయమై అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు. ఉన్నతాధికారులు కల్పించుకొని మదుం వద్ద, కాలువలో పూడ్చి వేసిన పూడిక తీయించి నీరు పోవడానికి చర్యలు తీసుకోవాలి.

– బత్తిన శ్యామ్‌కుమార్, కశింకోట

అధికారుల దృష్టికి తీసుకెళ్లాం

ప్రభుత్వ పశు వైద్య శాలకు రాకపోకలు సాగించే మార్గంలో నీరు నిల్వ ఉండిపోతున్న విషయమై అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. అందుకు తగు చర్యలు తీసుకోవాలని కోరాం.

–చైతన్యమణి, మండల పశు వైద్యాధికారి, కశింకోట

ఘనంగా ముగిసిన ఉరుసు ఉత్సవం



ఖవ్వాలి పాటల పోటీలో గానం చేస్తున్న నాగపూర్‌కు చెందిన అఫ్రీన్ సుల్తానా



ఖాదరీ బాబా దర్గా విద్యుద్దీపాలంకరణ

కశింకోట: స్థానిక హజ్రత్ సయ్యద్ అజీజ్ షా ఖాదరీ బాబా దర్గా ఉరుసు షరీఫ్ (చందనోత్సవం) ఘనంగా ముగిసింది. ఇందులో భాగంగా మూడో రోజు ఆదివారం సాయంత్రం చిరాగి (దీపారాధన) కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దర్గాలో ప్రార్థనలు చేశారు. దర్గా చుట్టూ ముస్లింలు సంప్రదాయంగా దీపాలు వెలిగించారు. అనంతరం జియారత్ ఖురాన్ ఖానీ, ఫాతిహా, మిలాద్ మహిళల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉరుసు ఉత్సవంలో భాగంగా శనివారం రాత్రి దర్గా ఆవరణలో నిర్వహించిన 'ఖవ్వాలి' పాటల పోటీ ఆహూతులను విశేషంగా అలరించింది. నాగపూర్‌కు చెందిన అఫ్రీన్ సుల్తానా, బెంగళూరుకు చెందిన మొహమ్మద్ అలీ ముస్తాక్ అనే గాయకులు పరస్పరం పోటీపడి భక్తి పాటలను ఆలపించి యువతను ఉర్రూతలూగించారు. దర్గాకు ఏర్పాటు చేసిన్న విద్యుద్దీపాలంకరణ ఆకట్టుకుంది.

వర్షంతో విద్యుత్ అంతరాయం

కశింకోట: ఆకాశం మేఘావృతమై ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం ఆదివారం సాయంత్రం కశింకోటలో కురిసింది. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. వర్షం తగ్గాక సరఫరా పునరుద్ధరించారు. ఉదయం నుంచి ఎండ వేడిమితో సతమతమైన ప్రజలు వర్షంతో వాతావరణం చల్లబడి ఉపశమనం పొందారు.

సీపీఎం నేతల గృహ నిర్బంధాలపై నిరసన



కొత్తపట్నం తీరంలో నినాదాలు చేస్తున్న సీపీఎం నాయకులు

రాంబిల్లి(అచ్యుతాపురం): రాంబిల్లి మండలం కొత్తపట్నం తీరంలో సీపీఎం ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు ఆదివారం నిరసన తెలిపారు. నక్కపల్లి మండలంలో బల్క్ డ్రగ్ పార్కుకు వ్యతిరేకంగా మత్స్యకారులు చేపడుతున్న దీక్షలకు మద్దతు పలుకుతున్నారనే నెపంతో పోలీసులు సీపీఎం నాయకులను గృహ నిర్బంధం చేయడాన్ని ఖండిస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఆర్. శంకర్‌రావు, మండల కార్యదర్శి జి.దేవుడు నాయుడు మాట్లాడుతూ సముద్ర తీర ప్రాంతాన్ని విషతుల్యం చేసే బల్క్‌డ్రగ్ పార్కును నిలిపివేయాలన్నారు. దీనికి వ్యతిరేకంగా చేస్తున్న ఉద్యమాలను అక్రమ అరెస్టులతో అడ్డుకోలేరని పేర్కొన్నారు. ప్రభుత్వానికి చేతనైతే ఎన్నికల హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. అక్రమ నిర్బంధాలను ఆపకుంటే తీవ్ర ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు నారాయణరావు, రామకృష్ణ, ధోని కాసియా, వై.రాము, సి.అప్పలరాజు, రమణ, శివాజీ, వరలక్ష్మి, మంగతాయారు, లక్ష్మి, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

మొల్లోడుగెడ్డలో నిలిచిన రసాయన వ్యర్థాలు

పరవాడ: మండలంలోని భర్నికం సమీపంలో ఉన్న మొల్లోడిగెడ్డలో నిలిచిన వ్యర్థ రసాయన జలాలను బయటకు తోడించాలని సిటు రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఫార్మా యాజమాన్యాలు ఇష్టానుసారంగా రసాయన వ్యర్థ జలాలను గెడ్డలోకి విడుదల చేయడంతో భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయని ఆరోపించారు. దీంతో వ్యవసాయ పంటలు దెబ్బతింటున్నాయన్నారు. ఆదివారం ఆయన మొల్లోడి గెడ్డను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ గెడ్డలో నిలిచిన రసాయన వ్యర్థ జలాలు విపరీతమైన దుర్వాసన వెదజల్లుతున్నాయని ఫలితంగా రహదారి ప్రయాణికులు ముక్కు మూసుకుని రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి దాపురించిందన్నారు. దీనిపై పీసీబీ అధికారులకు ఫిర్యాదు చేసినా తూతూ మంత్రంగా చర్యలు చేపట్టి చేతులు దులిపేసుకుంటున్నారని ఆక్షేపించారు.



రసాయన వ్యర్థ జలాలతో రంగు మారిన మొల్లోడుగెడ్డ నీరు

మొల్లోడిగెడ్డ ప్రాంతాన్ని రాష్ట్ర పీసీబీ చైర్మన్ కృష్ణయ్య పరిశీలించి వెళ్లారని, అయినా ఎలాంటి చర్యలు చేపట్టలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి చర్యలు చేపట్టాలని, లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళనకు దిగుతామని గనిశెట్టి హెచ్చరించారు.

అపూర్వ కలయిక



పాఠశాలలో కలుసుకున్న పూర్వపు విద్యార్థులు

కె.కోటపాడు : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2001–02లో టెన్త్ చదివిన విద్యార్థులు ఆదివారం అదే పాఠశాలలో ఆత్మీయంగా కలుసుకున్నారు. పాఠశాల చదువు పూర్తయిన 23 ఏళ్ల తరువాత అంతా కలుసుకోవడంతో వారి ఆనందానికి అవధులు లేకుండా పోయింది. నాడు చదువు చెప్పిన గురువులను ఈ కార్యక్రమానికి ఆహ్వానించి ఘనంగా సన్మానించారు. పూర్వ ఉపాధ్యాయులు స్వర్ణలత, తులసి, పద్మజ, కృష్ణకుమారి, కులయ్యతో పాటు పూర్వపు విద్యార్థులు కోలా మహేష్, ప్రవీణ్, ఎర్రినాయుడు, కండిపల్లి రమణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శూలాల మహోత్సవం



భారీ శూలం ధరించిన భక్తుడు



దుర్గాదేవి నిమజ్జనంలో భాగంగా తరలివచ్చిన భక్తులు

మునగపాక: మండలంలోని వాడ్రాపల్లిలో దుర్గాదేవి శూలాల మహోత్సవం శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. దుర్గాదేవి మాలలు ధరించిన పలువురు భక్తులు శూలాలు ధరించి అగ్నిగుండం తొక్కారు. శూలాలతో భక్తులు గ్రామంలో ఊరేగింపుగా బయలుదేరి అమ్మవారి నిమజ్జన కార్యక్రమంలో పాల్గొన్నారు. శూలాలతోపాటు అగ్నిగుండం తొక్కే కార్యక్రమాన్ని తిలకించేందుకు గ్రామస్తులు భారీగా తరలివచ్చారు. జై దుర్గా నామస్మరణతో వాడ్రాపల్లి మార్మోగింది. గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఆటల పోటీలు ప్రారంభం



తాండవలో ఆటలు పోటీలు ప్రారంభిస్తున్న నాతవరం ఎస్‌ఐ తారకేశ్వరరావు

నాతవరం: తాండవలో ఈనెల 7న జరగనున్న నల్ల కొండమ్మతల్లి పండగ సందర్భంగా నిర్వహించే ఆటల పోటీలను ఎస్‌ఐ వై.తారకేశ్వరరావు ఆదివారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గ్రామ దేవతల పండగల సందర్భంగా అసాంఘిక కార్యక్రమాలకు దూరంగా ఉండి, ఇలాంటి టోర్నమెంట్లు ఏర్పాటు చేసుకోవడం మంచి పరిణామమన్నారు.

పొంగిన గెడ్డలు

మాడుగుల రూరల్: వర్షాలకు మండలంలో తాచేరు, పాలగెడ్డ, చింతగెడ్డ, శారద, పెద్దేరు నదులు పొంగి ప్రవహిస్తున్నాయి. దీంతో నది పరివాహక ప్రాంతంలో వరి, ఇతర పంటలు నీటి ముంపునకు గురవుతున్నాయి. వరదగట్లు కోతకు గురవుతున్నాయి. తాచేరు ఉధృతంగా ప్రవహిస్తోంది.

13 నుంచి అయ్యప్పభక్తులకు భిక్ష

మునగపాక: స్థానిక అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలో ఈ నెల 13 నుంచి భక్తుల సౌకర్యార్థం భిక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కమిటీ ప్రతినిధి పెంటకోట ఉమేష్ తెలిపారు. ఆదివారం ఆలయ ప్రాంగణంలో కమిటీ సభ్యులు మాట్లాడుతూ నాలుగు సంవత్సరాలుగా ఆలయ ప్రాంగణంలో భక్తుల సౌకర్యార్థం మధ్యాహ్నం భిక్ష నిర్వహిస్తూ వస్తున్నామన్నారు. ఈ ఏడాది కూడా అందరి సహకారంతో 41 రోజుల పాటు భిక్ష సదుపాయం కొనసాగించేందుకు నిర్ణయించామన్నారు. దీనికి విరాళాలు అందజేయాలని కోరారు. సర్పంచ్ దిమ్మల అప్పారావు, వేగి లక్ష్మణరావు, డాక్టర్ బద్దెం సూర్యనారాయణ, కాండ్రేగుల జగ్గారావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అయ్యప్పస్వామి ఆలయ కమిటీ ప్రతినిధి ఉమేష్

బాణసంచా అక్రమ తయారీదారుడి అరెస్ట్



పోలీసులు స్వాధీనం చేసుకున్న మందుగుండు సామగ్రి



నిందితుడితో పెందుర్తి పోలీసు సిబ్బంది

పెందుర్తి: మండలంలోని పార్లపాలెం రెవెన్యూ పరిధి ఆర్ఆర్ వెంకటాపురం శివారు మేహాద్రిగెడ్డ సమీపంలోని కంపర వారి కల్లాలు వద్ద రేకుల షెడ్డులో అక్రమంగా మందుగుండు సామగ్రి తయారు చేస్తున్న కొండవలస రవికుమార్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. పెందుర్తి ఎస్‌ఐ ఎన్‌వీ భాస్కరరావు తెలిపిన వివరాలు. గోపాలపట్నం దరి పద్మనాభనగర్‌కు చెందిన రవికుమార్ 2024లో అక్రమంగా మందుగుండు సామగ్రి తయారు చేస్తూ పోలీసులకు చిక్కాడు. అతనిపై కేసు నమోదు చేసి, జైలుకు పంపారు. జైలు నుంచి విడుదలయ్యాక కొంత కాలం ఆటో నడుపుతూ జీవనం సాగిస్తూ వచ్చాడు. ఆ సంపాదన కుటుంబ పోషణకు చాలకపోవడంతో మళ్లీ మందు గుండు సామగ్రి తయారీకి సిద్ధమయ్యాడు. ఐదు రోజుల నుంచి రహస్యంగా తయారీ కొనసాగిస్తున్నట్లు తెలిసిందని ఎస్‌ఐ తెలిపారు. పోలీసులు జరిపిన దాడిలో అక్రమంగా నిల్వ చేసిన సురేకారం, చార్కోల్, సున్నం, పీవీసీ మందు, తారా జువ్వలు, బెల్ట్ బాంబులు, డ్రిల్లింగ్ మిషన్, ప్రెస్సింగ్ మిషన్, భారీ మొత్తంలో మందుగుండు ముడి పదార్థాలు, తయారీ పరికరాలను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. నిందుతుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చగా 15 రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్‌ఐ భాస్కరరావు వెల్లడించారు.

అధ్వాన రోడ్డుతో అవస్థలు

పరవాడ: భారీ వాహనాల రాకపోకలతో ఎన్టీపీసీ–సోమునాయుడుపాలెం రోడ్డు అధ్వానంగా మారింది. రహదారిలో నిత్యం రాకపోకలు సాగిస్తున్న బొగ్గు లారీలతో రోడ్డు గోతులమయంగా మారిన నేపథ్యంలో అనేక గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డులో ఏర్పడిన భారీ గుంతలతో వర్షం కురిసినపుడు, రాత్రి సమయంలో రాకపోకలు సాగించే ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అధిక బరువుతో రాకపోకలు సాగిస్తున్న బొగ్గు లారీల కారణంగా గోతులు మరింత పెద్దవిగా మారుతున్నాయి. ఎన్టీపీసీ, ఫార్మాసిటీ, హిందూజా పరిశ్రమల్లో పనిచేసే ఉద్యోగులు, కార్మికులు గోతుల కారణంగా తరచూ ప్రమాదాలకు గురవుతున్నట్లు వాపోతున్నారు. తమ ఇబ్బందుల్ని గుర్తించి రోడ్డు మరమ్మతులకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



అధ్వానంగా మారిన సోమునాయుడుపాలెం రోడ్డు

కాలువల్లేక రోడ్డుపైనే మురుగు



మురికి కూపంగా మారిన మూలస్వయంభూవరం రోడ్డు

పరవాడ: మండలంలో కలపాక శివారు మూలస్వయంభూవరం గ్రామంలో మురుగు కాలువలు ఏర్పాటు చేయని కారణంగా గ్రామ ప్రధాన రహదారి మురికి కూపంగా మారింది. గ్రామస్తుల వాడుక నీరు రోడ్డు మీదకు చేరి గుంతల్లో నిలిచిపోతోంది. దీంతో రహదారి ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో వీధి కాలువలు నిర్మించడానికి పంచాయతీ పాలకవర్గం కనీస చర్యలు చేపట్టలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. వాడుక నీరు పోవడానికి మార్గం లేక వృథా నీరంతా రోడ్డుపై నిలిచిపోతోందని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా పంచాయతీ పాలకవర్గం స్పందించి మురుగునీరు పోవడానికి వీలుగా కాలువ నిర్మాణం చేపట్టాలని కోరుతున్నారు.